## క్లుప్తంగా

### పర్యావరణ రక్షణతోనే జీవరాశి మనుగడ

కడప కల్చరల్ : పర్యావరణాన్ని రక్షించుకున్నప్పుడే జీవరాశి మనుగడ సాధ్యమవుతుందని జిల్లా గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలమయంలో విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక సహకారంతో ఆయన ఈ కార్యక్రమంలో బాలలకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు సమీర్‌బాష, వెంకటేశ్వర్లు పర్యావరణ పరిరక్షణ గురించి గీతాలను ఆలపించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ సుజాతరాణి, గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భూ కబ్జాలను అరికట్టండి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ప్రభుత్వ భూముల కబ్జాలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఖాజీపేట, మైదుకూరు, మైలవరం, జమ్మలమడుగు, పెండ్లిమర్రి మండలాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఆర్డీఓలు ఇందుకు సహకరిస్తున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై గతంలో పలుమార్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని కోరారు.

### కరపత్రాలు ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని, యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డీఈఓ రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అబ్దుల్ రాయల కరీముల్లా రక్తదాన పత్రాలను విద్యాశాఖ కార్యాలయం వద్ద పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సంబంధిత కరపత్రాలను డీఈఓ రాఘవరెడ్డి, విద్యాశాఖ సిబ్బందితో విడుదల చేయించారు.

### రైలు ప్రమాదానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఒరిస్సాలోని బాలాసోర్‌లో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి బీజేపీ ప్రభుత్వ వైఫల్యమేనని ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒరిస్సా రైలు ప్రమాదం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఈ ప్రమాదం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ ప్రమాదానికి కారకులైన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బేషరత్తుగా రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు కిషోర్, కృష్ణారెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### కౌలు రైతుల సంఘం కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏపీ కౌలు రైతుల సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శిగా ఎదురు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వైవీ సుదర్శన్ రెడ్డి, వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా యానాదయ్య, మురళితో పాటు పలువురి ఎన్నుకున్నారు.

### డయేరియాను అరికడదాం

కడప రూరల్: డయేరియా వ్యాధిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. అతిసారా నియంత్రణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక మోచంపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా నిర్మూలనపై నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా, ఆరోగ్య కార్యకర్తలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రతి ఇంటినీ సర్వే చేసి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించాలన్నారు.ఆ పిల్లలకు డయేరియా రాకుండా ఉండడానికి తల్లిదండ్రులకు జింక్ మాత్రలు మరియు ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్స్‌ను అందజేయాలన్నారు. డాక్టర్ అనితశ్రీ, రాధాకృష్ణ హస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిరుద్యోగులను మోసం చేస్తున్న పాలకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నిరుద్యోగులను పాలక ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు విమర్శించారు. సోమవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తోందన్నారు. రైల్వేశాఖలో మూడు లక్షలు పైగా ఉద్యోగాలు ఉన్నాయని ప్రకటిస్తున్నారే తప్ప ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. లోకో పైలెట్లు, స్టేషన్ మేనేజర్లు, ఇంజినీరింగ్ నాన్ ఇంజినీరింగ్ వంటివి భర్తీ చేయకపోవడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్
- నగరంలో భారీ గ్రీన్ ర్యాలీ..
- పలు చోట్ల క్లీన్ అండ్ గ్రీన్

కడప కార్పొరేషన్:పర్యావరణాన్ని రక్షించేందుకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్పొరేటర్లతో కలిసి కమిషనర్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవానికి 50 ఏళ్ల పూర్తవడం ఈ ఏడాది ప్రాముఖ్యత అన్నారు. ప్రకృతికి హాని కలిగించని రీతిలో జీవన శైలిని కొనసాగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులు గుడ్డ సంచులు ఉపయోగించాలన్నారు. డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ అరీఫుల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

- పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. ఏపీహెచ్‌బి కాలనీలోని వైఎస్ విజయమ్మ పార్కును వారు శుభ్రపరిచారు.
- స్థానిక 23వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో వార్డు సచివాలయ సిబ్బంది చెత్తాచెదారం ఎత్తివేసి, రోడ్లు ఊడ్చారు. వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- 13వ డివిజన్‌లో కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డును శుభ్రపరిచారు.
- నగరంలోని 47వ డివిజన్‌లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు, కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.
- నగర శివార్లలో సింగపూర్ టౌన్‌షిప్‌లో ఎస్‌పీఎం సింగపూర్ టౌన్‌షిప్ సోషియో, కల్చరల్ అసోషియేషన్, అటవీ శాఖ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. రమణయ్య, టౌన్‌షిప్ రెసిడెంట్స్ అసోషియేషన్ వై. ప్రభాకర్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు పాల్గొన్నారు.

వైవీయూ/ఏఎఫ్‌యూ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని 30 ఆంధ్రా బెటాయలిన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఎన్‌సీసీ అధికారులు డా. ఆర్. నీలయ్య, డా. మహేష్, అధ్యాపకులు యు. రమ్యజ్యోతి, డా. సురేష్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, రెడ్డిబాషా పాల్గొన్నారు.



గ్రీన్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు


పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ అంజనేయప్రసాద్


వైవీయూ బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి, నీరుపోస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

- కడప నగరంలోని డా. వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వీసీ అంజనేయప్రసాద్ పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి, రవితేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.
- గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఎన్‌సీసీ అధికారి కె. ఇమాంఖాసీం ఆధ్వర్యంలో కేడెట్స్ మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు.
- కడప నగర పరిధిలోని పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కడప డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, కళాశాల కరస్పాండెంట్ గౌతంకుమార్‌రెడ్డి, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.
- కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేనేత సంచులను పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్‌రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సావిత్రి పాల్గొన్నారు.
- కడప ఆర్ట్స్ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిరుధాన్యాల సాగు, వినియోగ ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా వైవీయూ**

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఆదర్శంగా నిలపాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని విశ్వవిద్యాలయం పర్యావరణ చైతన్యర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడారు. అంతకు ముందు విశ్వవిద్యాలయంలోని బొటానికల్ గార్డెన్‌లో వీసీ చింతా సుధాకర్ మొక్కలు నాటి నీరుపోశారు.

- ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ, ఎన్ఎస్ఎస్ పీఓ తదితరులు పాల్గొన్నారు.

కడప అగ్రికల్చర్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని కృషి విజ్ఞానకేంద్ర సయన్వయకర్త వీరయ్య పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం కేవీకేలో ఘనంగా నిర్వహించారు. ఆత్మ పథకం సంచాలకులు విజయలక్ష్మి, ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ మాట్లాడారు. అనంతరం కేవీకే ఆవరణంలో కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు మొక్కలను నాటారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి శ్రీనివాచారి, విశ్రాంతి జిల్లా అటవీ అధికారి ఖాదర్‌వల్లి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

**కలెక్టరేట్ ప్రాంతంలో శుభ్రతకు కృషి**

కడప కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాకు గర్వకారణమైన పాత కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని కడప నగరం 30వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ షఫీ అన్నారు. భారతీయ జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) నిర్వహించిన పర్యావరణ రక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టరేట్ భవనాన్ని కాపాడుకునేందుకు, ఈ పరిసరాలను శుభ్రం చేసేందుకు ఇంటాక్ నడుం బిగించడం అభినందనీయమన్నారు.ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, ఇంటాక్ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు ఆర్.రంగనాథరెడ్డి, మాట్లాడారు. అంతకుముందు మున్సిపల్ మెయిన్ హైస్కూలు నుంచి ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

- పర్యావరణాన్ని రక్షించడం ప్రజలందరి బాధ్యత అని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ అన్నారు. ఏపీ టూరిజం హరిత సమావేశ మందిరంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురికి బహుమతులు అందజేశారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇంజనీరు జావిద్, కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కిరణ్, సిమెంటు ఫ్యాక్టరీల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జడ్జి ప్రదీప్‌కుమార్


మొక్కలు నాటుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్


వైఎస్ విజయమ్మ పార్కులో ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ వై. మాధవి, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు


పాత కలెక్టరేట్‌ను శుభ్రపరుస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

## సుస్థిర ఆర్థిక స్థిరత్వం అవసరం

కడప అగ్రికల్చర్: నేటి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ పంటల ద్వారా ఆర్థిక సుస్థిరత సాధించడం కష్టతరం అవుతుందని ఈ నేపథ్యంలో యువ రైతులు కొద్దిపాటి వనరులను లాభసాటిగా మార్చుకుని సుస్థిత ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. సోమవారం కేవీకేలో గ్రామీణ యువతకు ఆర్య పథకంలో వానపాముల ఎరువుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయంతోపాటు ఆదనపు ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వానపాముల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పరచుకుని ఆదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ , ఆత్మ పీడీ డాక్టర్ విజయలక్ష్మి, సేద్య విభాగ శాస్త్రవేత్త సాయి మహేశ్వరి మాట్లాడారు. శాస్త్రవేత్తలు శిల్పకళ, స్వామిచైతన్య, మహేష్‌బాబు, ప్రశాంతి, మానస, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 49 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

– రవీంద్రనగర్ గుర్రాలగడ్డ షామీరియా మసీదు వద్ద నున్న వంతెనను, లా కళాశాల వద్దనున్న నడకదారి వంతెనను త్వరితగతిన నిర్మించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. వెంకటశివ కోరారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సంజీవ్ కుమార్, ఎంహెచ్‌ఓ ప్రశాంత్ వర్ధన్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

## అట్టడుగు వర్గాలకు ప్రత్యేక విద్యాబోధన కల్పించాలి

**– ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ కులాల్లో 6, 9, 10, 11 తరగతుల విద్యకు దూరమైన వారిని వలంటీర్ల ద్వారా గుర్తించి ప్రత్యేక విద్యాబోధన కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శులు పి.అంజనేయులు, కర్ణమాదిగ, బీసీ గంగులు మాట్లాడుతూ వీరితోపాటు డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన సదుపాయాన్ని కల్పించకపోతే యువత పలు రకాల వ్యసనాలకు బానిసై చిన్న వయస్సులోనే నేరస్తులుగా మారే ప్రమాదం ఉంటుందని తెలిపారు. వీరి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాల లక్షుమయ్య, కె.బాల పుల్లయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి నిరంకుశ ఫాసిస్టు చర్యలను ముమ్మరం చేసిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర,నాయకులు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, వెంకట శివ పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీ సత్యనారాయణస్వామి కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. టీటీడీ వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమ శాస్త్ర పండితులు రాజేష్‌భట్టర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## బలిజలకు మీరేం చేశారో చెప్పండి!

కడప కల్చరల్ :బలిజలకు మీరేం చేశారో చెప్పాలని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళీకృష్ణ నారా లోకేష్‌పై మండిపడ్డారు. సోమవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీని ఆదరిస్తున్న బలిజల్లో విషం చిమ్మేందుకు విడదీసి పాలించే కక్కుర్తి పథకం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారా అని మండిపడ్డారు. బలిజలకు ఈ మాత్రమైనా మేలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, జిల్లా సమస్యలపై బలిజ నాయకులు నారాయణస్వామి మీ ప్రభుత్వంలో ఇచ్చిన వినతిపత్రంపై ఇంతవరకు స్పందించనే లేదని ఆరోపించారు. కాపుల కోసం కృషి చేసిన ముద్రగడ పద్మనాభంను ఎంతమాత్రం గౌరవించారో కాపులందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికే బలిజలు తమ ప్రాబల్యంగల ప్రాంతాలలో టీడీపీని చావుదెబ్బతీసిన విషయం మరిచిపోయావా? అంటూ నిలదీశారు. బలిజలకు నువ్వేం చేస్తావో చెప్పకుండా సొల్లు కబుర్లు చెబితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## స్వీపర్లకు సంక్షేమ పథకాలు అందించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్పీ ఆఫీసు, పోలీసుస్టేషన్లు, డీటీసీ కార్యాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి కోరారు.సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. నాలుగు వేల రూపాయల వేతనం తీసుకునే స్వీపర్లకు ప్రభుత్వ పథకాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఎస్పీ ఆఫీసు, డీటీసీ కార్యాలయాల్లో 82 మంది పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్నారన్నారు. జగనన్న చేయూత, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు కామాక్షమ్మ, వెంకట సుబ్బమ్మ, మల్లేశ్వరి, సరస్వతి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలను నడుపుతున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచడం లేదన్నారు. మెను ప్రకారం ప్రతి విద్యార్థికి రూ. 30 మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, చాంద్‌బాష, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## పబ్బాపురం ఉపాధ్యాయుల భూమిని రక్షించుకుందాం

కడప ఎడ్యుకేషన్: అన్యాక్రాంతమైన పబ్బాపురం ఉపాధ్యాయుల భూమిని పరిరక్షించాలని కడప ఎలిమెంటరీ స్కూల్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని సీఎస్ఐ హైస్కూల్లో కడప ఎలిమెంటరీ స్కూల్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్లాట్ల లబ్ధిదారుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సొసైటి అధ్యక్షులు లక్ష్మిరాజా , ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పబ్బాపురం ప్లాట్లకు సంబంధించి నాలుగు నెలల క్రితం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల సొసైటీ భూమి అన్యుల పాలైయిందన్నారు. దాదాపు రూ. 60 కోట్ల విలువైన 20 ఎకరాలు కార్యవర్గ సభ్యులకు తెలియకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అన్యులకు అప్పగించడంపై అధ్యక్షుడిని సభ్యులు గట్టిగా నిలదీశారు. ఈ విషయమై అప్పట్లో జేసీ ఆర్‌డీఓ, సబ్‌రిజిస్ట్రార్‌కు కూడా ఫిర్యాదు చేశామని ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి, డైరెక్టర్లు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ 20 ఎకరాల భూమిని సొసైటికి అందేలా కృషి చేయాలని తీర్మాణం చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బాలశివారెడ్డి, శ్యాసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బాలకృష్ణుడు, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశం అభివృద్ధి చెందిదంటే కేవలం బీజేపీతో మాత్రమేనని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ఖ్యాతి, కీర్తి ప్రతిష్ఠలు ప్రపంచం నలుమూలల వ్యాపించాయన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈనెల 8న విశాఖపట్టణానికి రానున్నారన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి రానున్నారని తెలిపారు.ఈ సందర్భంగా జరిగే సభలకు బీజేపీ నాయకలు, కార్యకర్తలు విరివిగా హాజరై సభలను విజయవంతం చేయాలన్నారు. బీజేపీ కడప పార్లమెంటు ఇన్‌ఛార్జి బాలకృష్ణ యాదవ్, రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి సాయి లోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, అనంత కేశవ, లక్ష్మణరావు, రంగప్రసాద్, కల్యాణ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న నాగోతు రమేష్‌నాయుడు

## ఉదారత చాటిన వైఎస్సార్‌సీపీ నేత

**నిరుపేద యువతుల వివాహాలకు రూ.60వేలు బహుమానం**

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ 34వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అలీ అక్బర్ ఉదారత చాటుకున్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం ఇద్దరు నిరుపేద ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.30వేలు చొప్పున రూ.60వేలు అందజేశారు. ఈ సందర్భంగా అలీ అక్బర్ మాట్లాడుతూ పుట్టిన రోజు పేరిట పార్టీలు, డిన్నర్లు, కేకుల కోసం డబ్బు వృథా చేయడం కన్నా నిరుపేద యువతులకు ఆ డబ్బు ఉపయోగపడుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, చాక్లెట్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


పేద యువతుల పెళ్లి ఖర్చులకు రూ.60వేల చెక్కులు అందజేస్తున్న అలీ అక్బర్, పార్టీ నేతలు

## మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. సోమవారం నగరంలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సెటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి**

పెండ్లిమర్రి: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని మాచునూరు, మాచునూరు హరిజనవాడ, కొత్తపేట, యారాసుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మాచునూరు హరిజనవాడలో సీసీరోడ్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుక వచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ లైన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు.

**సచివాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే , ఆర్టీసీ ఛైర్మన్**

మాచునూరు గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్‌లను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేష్ రామాంజులరెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే